www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 10 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Hyderabad, Karimnagar, Circulated to : Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 68 | మంగళవారం | 10 ఫిబ్రవరి, 2026

## సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

### బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్లు పేర్కొంది.




4

## స్పీకర్ తీరుపై విపక్షాల ఆగ్రహం

- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ

4






## సైలెన్స్ ప్లీజ్

### మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం సమాప్తం

- 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- రేపటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సోమవారం ప్రచార గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా మైకులు మూగబోయాయి. 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 12,930 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 52.50 లక్షలమంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

2



# పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- 12 ఏళ్ల బీజేపీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన చూడండి
- అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం
- మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో
- తెలంగాణ రూపాయి ఇస్తే.. 42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపీలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి

### రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి



**ప్రజానావ, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృ ద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల కు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ము ఖం చూసి ఓటేయమని బీజేపీ అడగడాన్ని ఎద్దేవా చేశారు. బీజేపీ అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్ను లు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

మిగతా 2 లో

## ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు రేవంత్ దిశానిర్దేశం

2



## ఆ రెండు పార్టీలకు ఓటేస్తే..

- రాష్ట్రం మరో బంగ్లాదేశ్
- రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

2



## సీఎం ఎవరైనా సరే ఎంఐఎం దగ్గరకి రావాల్సిందే..

- మేమే లేకపోతే జూబ్లీహిల్స్ గెలిచేవారా?
- ఎంఐఎం భయానికి ముస్లింలకు బీజేపీ టికెట్లు
- కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు

3

## జీహెచ్ఎంసీ పదవీకాలం సమాప్తం

- మేయర్ విజయలక్ష్మికి సన్మానం




2

దేశంలోనే అతిపెద్ద నగరపాలక సంస్థ జీహెచ్ఎంసీకి మేయర్‌గా పని చేయడం గర్వంగా ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. తన పదవీ కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు , కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలిగామని తెలిపారు. తనకు సహకరించిన కార్పొరేటర్లు, అధికారులకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఓటుకు నోటు సాక్ష్యాలు దగ్ధం

- ఫోరెన్సిక్ అగ్నిప్రమాదం ఓ కుట్ర
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు

3





2

## కాంగ్రెస్‌కు కాదు.. బీఆర్ఎస్‌కు ఓటేయండి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్

మున్సిపల్ ఎన్నికల వేళ పఠాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.



## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ

3

ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు.

## రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు, హత్యలు

మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నుపోటు

సీఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆరోపణలు

3





# ఖమ్మంలో 5కోట్ల గంజాయి దగ్ధం

**ప్రజానావ, ఖమ్మం:** మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు కీలక అడుగు వేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన భారీ గంజాయి నిల్వలను అధికారులు సోమవారం బహిరంగంగా కాల్చివేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేట గ్రామం సమీపంలో ఉన్న ఒక బయో వేస్టేజ్ కంపెనీ ఆవరణలో ఈ కాల్చివేత కార్యక్రమం జరిగింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ చర్య తీసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు 5 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 47 కేసులకు సంబంధించి పట్టుబడిన గంజాయిని ఇక్కడకు తరలించారు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ఎక్సైజ్ సిబ్బంది అంతా కలిసి మంటల్లో వేసి గంజాయిని పూర్తిగా దగ్ధం చేశారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాదు.. బీఆర్ఎస్‌కు ఓటేయండి

## పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్

**ప్రజానావ, సంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న మహిపాల్ రెడ్డి, పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి సహా కొందరు అనుచరులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమ నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనాలు రాలేదన్న కారణంతో.. మహిపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరతారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన మహిపాల్ రెడ్డి.. ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆ రెండు పార్టీలకు ఓటేస్తే.. తెలంగాణ మరో బంగ్లాదేశ్

## రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**ప్రజానావ, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సెటైర్లు గుప్పించారు. ఓవైసీకి రేవంత్‌రెడ్డి దాసోహం అంటున్నారని విమర్శలు చేశారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అసదుద్దీన్ , అక్బరుద్దీన్‌లకు రేవంత్‌రెడ్డి సరెండర్ అయ్యారని ఎద్దేవా చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని చూసి బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసినా.. ఎంఐఎంకు ఓటు వేసినా తెలంగాణ మరో బంగ్లాదేశ్ అవుతుందన్నారు. దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని మోదీని చూసి బీజేపీకి ఓటేయాలని రాజాసింగ్ సూచించారు.

# పార్కింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా

## 1600 గజాలు స్వాధీనం

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ శివార్లలోని నార్సింగి ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై హైడ్రా అధికారులు మరోసారి ఉక్కుపాదం మోపారు. ఒక ప్రజాప్రతినిధి అండతో కబ్జాకు గురైన అత్యంత విలువైన పార్క్ స్థలాన్ని అధికారులు విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం కేటాయించిన స్థలాలను అక్రమంగా ఆక్రమిస్తే ఊరుకునేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు స్పష్టమైన హెచ్చరికలు పంపారు. నార్సింగిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీలో సుమారు 1,600 గజాల విస్తీర్ణం కలిగిన పార్క్ స్థలాన్ని ఒక ప్రజాప్రతినిధి అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఆక్రమణదారులు ఆ స్థలం చుట్టూ భారీ ప్రహరీ గోడను నిర్మించి, దానిని తమ వ్యక్తిగత ఆస్తిగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఈ కబ్జాపై స్థానిక నివాసితులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను జెసిబిలతో కూల్చివేసి ఆక్రమణలను తొలగించారు. అనంతరం ఆ 1,600 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, దానిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా అధికారులు సిద్ధమవుతున్నారు. కోట్ల రూపాయల విలువైన పార్క్ స్థలం కబ్జాకు గురవుతున్నా, స్థానిక మున్సిపల్ అధికారులు నోరు మెదపకపోవడంపై అరుణోదయ హౌసింగ్ సొసైటీ సభ్యులు , స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారుల అండదండలు లేనిదే ఇంత పెద్ద మొత్తంలో స్థలం కబ్జాకు గురికాదని వారు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ, హైడ్రా జోక్యంతో తమ పార్క్ స్థలం తిరిగి తమకు దక్కడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి



దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళు తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.

# ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసాలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



**ప్రజానావ, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసాల చూడాలన్నారు.

# సైలెన్స్ ప్లీజ్

## మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం సమాప్తం

## 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం

## 11న పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం ముగిసింది. చివరి రోజున అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించగా, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా ప్రచారాన్ని ఉధృతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారం ముగియడంతో ఇన్నాళ్లు మార్మోగిన వీధులు ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఈ ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు సెమీ ఫైనల్స్‌గా భావిస్తూ తీవ్రంగా ప్రచారం నిర్వహించాయి. అగ్రనేతల పర్యటనలు, భారీ రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారంతో రాజకీయ వేడి పెరిగింది. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 25,62,639 మంది పురుషులు, 26,80,014 మంది మహిళలు, అలాగే 640 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈసారి ఎన్నికల్లో కీలక అంశంగా మారింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 8,195 పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేశారు. పర్యవేక్షణ కోసం 1,379 రిటర్నింగ్ ఆఫీసర్లు, 1,547 సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లు, 9,560 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అలాగే 31,428 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌ల భద్రత కోసం 137 స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు మోహరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించి పారదర్శకతను నిర్ధారిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ అనంతరం ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అనంతరం ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఎన్నికలు, చివరగా ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం జరుగుతుంది.

# జీహెచ్ఎంసీ పదవీకాలం సమాప్తం

## మేయర్ విజయలక్ష్మికి సన్మానం

**ప్రజానావ, హైదరాబాద్:** నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. తన పదవి కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారాన్ని మరువలేనని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అదనపు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం.. అక్కడ గుర్తించిన ఉత్తమ విధానాలతో కూడిన సమగ్ర అధ్యయన నివేదికను కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందజేసింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని కర్ణన్ తెలిపారు.




కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రజా సమస్యలను చాలా వరకు పరిష్కరించామని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ పదవీకాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు.

# రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ



**ప్రజానావ, మెదక్:** ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారంటూ తెలంగాణ సీఎంపై ఆయన మండిపడ్డారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరిలో జరిగిన ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఇది సీఎం రేవంత్ డైరెక్షన్‌లో జరిగిందంటూ ఆయన బల్లగుద్ది చెప్పారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్‌ని వ్యాఖ్యానించారు. జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే పోలీసులు చేసిన దహనఖాండ ఇది అని అభివర్ణించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఓటకు నోటు సాక్ష్యాలు దగ్ధం

- ఫోరెన్సిక్ అగ్నిప్రమాదం ఓ కుట్ర
- ప్రచారంలో సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు



**ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి:** నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం లో ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. అనుచిత వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి పోలింగ్ కేంద్ర?ంలోనే బుద్ధి చెప్పాలని అన్నారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. భూపాలపల్లి సింగరేణిని ఆగం చేసేందుకు చూస్తున్నారని ఆరోపణలు చేశారు. తులం బంగారం, రూ.4వేల పెన్షన్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ పథకాలు తీసుకుంటున్న వాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇవ్వాళ, రేపు మద్యం, డబ్బులు పంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని ఎద్దేవా చేశారు. మ-రోసారి మోసపోయి భస్మాసుర చేయి లాంటి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహించారు. 12ఏళ్లలో తెలంగాణకు బీజేపీ నయాపైసా పనిచేయలేదని ÷ర్ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేటీఆర్ వచ్చారు. ఆయన పర్యటనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేటీఆర్ కార్నర్ మీటింగ్ సందర్భంగా సామాజిక కార్యకర్త, దివంగత రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగించారు. కేటీఆర్ కార్నర్ మీటింగ్ నేపథ్యంలో రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగింపుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండ్రి ఫ్లెక్సీని కావాలనే బీఆర్ఎస్ నేతలు తొలగించారంటూ రాజలింగమూర్తి కుమార్తె ఆరోపించారు.

# ఏ సీఎం అయినా ఎంఐఎం దగ్గరకి రావాల్సిందే..

- మేమే లేకపోతే జూబ్లీహిల్స్ గెలిచేవారా?
- ఓవైసీ బ్రదర్స్‌ను తిట్టడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్ పని
- ఎంఐఎం భయానికి ముస్లింలకు బీజేపీ టికెట్లు
- జేపీ సెక్యులర్ పార్టీగా మారేందుకు ప్రయత్నాలు
- ఎంఐఎం లేకపోతే బీజేపీకి మనుగడనే లేదు
- కరీంనగర్‌ను అభివృద్ధి అడ్డాగా మారుస్తాం
- కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు



**ప్రజానావ, కరీంనగర్:** రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ సీఎం అయినా, ఎంఐఎం దగ్గరికి రావాల్సిందే అని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం అందరి పార్టీ అని పేర్కొన్నారు. రెడ్డిలు, రావులు చేసినంత డబ్బు ఖర్చు ఎంఐఎం చేయలేదేమో.. కానీ, ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు అండగా ఉండే పార్టీ ఎంఐఎం పార్టీని కార్పొరేషన్ ఎన్నికల్లో అండగా ఉండాలని, 15కు 15 సీట్లు గెలిపించిన కరీంనగర్‌సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కరీంనగర్ లోని వెలమ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నగరంలో 15 డివిజన్లలో పోటీ చేస్తున్న ఎంఐఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రులుగా ఎవరు వచ్చినా ఓవైసీ సోదరుల వద్దకు ఎందుకు వస్తారో ఒక్కసారి ఆలోచించాలని ప్రజలను కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తీరును విమర్శిస్తూ, ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఫలితాలను ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్‌తో తాము కలవకపోయి ఉంటే అక్కడ గెలుపు సాధ్యమయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. అధికారంలో ఎవరు ఉన్నా, వారు ఏ పార్టీ వారైనా సరే తమ వద్దకు రావాల్సిందేనని, అది కేవలం ప్రజల బలమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏ కులం లేదా ఏ వర్గం వారు తమ సొంతం కాదని, కేవలం తమ సిద్ధాంతాన్ని నమ్మే వారే తమ బలమని పేర్కొన్నారు. ఇమామ్, మౌజన్ గౌరవ వేతనాలతో పాటు అర్చకులకు గౌరవ వేతనాల గురించి ఎంఐఎం గొంతెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంఐఎం అందరి పార్టీ అని చెప్పడానికి ఇంత కంటే ఏ ఉదాహరణ ఉండదని పేర్కొన్నారు. అసెంబ్లీలో తమ ఉనికి ఉంటేనే పనులు జరుగుతాయని, రాజకీయాలు చేయడం తమకు వెన్నతో పెట్టిన విద్య అని ఆయన తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. బీజేపీకి మతరాజకీయాలు తప్ప, వేరేది చేతగాదు అని అన్నారు. నెహ్రూ నుంచి మోదీ వరకు ముస్లింలు, దళితులను మోసం చేశారన్నారు. ప్రజలను మోసం చేయడంలో మోదీ బడే భాయ్.. రేవంత్‌ఛోటే భాయి అని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎవరి అడ్డానో కాదని, దానిని అభివృద్ధికి అడ్డాగా మారుస్తామని పేర్కొన్నారు. 420 హామీలతో కాంగ్రెస్ మోసం చేసిందని, ఏ ఒక్క హామీనైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. మైనార్టీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.3500 కోట్లు ప్రకటించి, కేవలం అందులో 38శాతం మాత్రమే కేటాయించడం వారికి మైనార్టీలపై ఉన్న ప్రేమ ఎంతటిదో చాటి చెబుతున్నదని చెప్పారు. బీజేపీ నేతలు నిత్యం ఓవైసి బ్రదర్స్‌పేరును వాడుకుంటూ, రాజకీయం చేస్తున్నదన్నారు. ఎంఐఎం పార్టీ లేకపోతే, బీజేపీకి మనుగడనే లేదని పేర్కొన్నారు. ఎంఐఎం దయాదాక్షిణ్యాలతో గెలిచిన గంగుల కమలాకర్.. నేడు అదే ఎంఐఎంపై విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకు నిదర్శమన్నారు. కరీంనగర్‌కార్పొరేషన్‌తో పాటు రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై ఎంఐఎం జెండా ఎగురుతుందని జోస్యం చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత కరీంనగర్ కు వస్తానని, అప్పుడు విజయోత్సవ ర్యాలీలు ఘనంగా నిర్వహిద్దామని ఆకాంక్షించారు.

### ముస్లింలకు బీజేపీ టికెట్లా?

ఎంఐఎం పార్టీకి బీజేపీ భయపడుతున్నదని అక్బరుద్దీన్ విమర్శించారు. ఎంఐఎం భయానికి బీజేపీ గతంలో లేనటువంటి సంస్కృతి తెరలేపిందని, ఏకంగా ముస్లిం అభ్యర్థులకు టికెట్లు కేటాయించిందని విమర్శించారు. మతతత్వ ముద్రను తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. కరీంనగర్‌బీజేపీ అడ్డా అయి ఉంటే, ముస్లింలకు ఎందుకు టికెట్లు కేటాయించారని ప్రశ్నించారు. కరీంనగర్ ఎవరి అడ్డా కాదని, పని చేసేటోళ్లకే ప్రజలు పట్టం కడతారని హితబోధ చేశారు. ఇక గంగుల కమలాకర్ విషయానికి వస్తే, ఆయనో కబ్జాదారుడని విమర్శించారు. సుమారు 55 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కబ్జా పెట్టారని, ఆ భూమిని తిరిగి సాధించి, ముస్లింలకు బహుమతిగా ఇస్తానని స్పష్టం చేశారు. దానిని ముస్లింల సంక్షేమానికి ఉపయోగిస్తామన్నారు. నమ్మిన సిద్ధాంతాన్ని పాటించడమే ముస్లింల జీవన విధామన్నారు. అందరి కష్టసుఖాల్లో పాలు పంచుకునే పార్టీ ఎంఐఎం అన్నారు. కరీంనగర్ లో మైనార్టీ యువత కోసం ఏ ఒక్క మైనార్టీ స్టడీ సర్కిల్ లేదని, ఎంఐఎంను గెలిపిస్తే, మైనార్టీ స్టడీ సర్కిల్‌ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఉమ్మడి జిల్లా పరిశీలకుడు యాసర్ అరఫాత్, కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర కమిటీ నాయకులు బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి యూసుఫ్, ఆతిన ఆతిఫ్, ఇబ్రహీం, ఖమారుద్దీన్, అజర్ దబీర్, ఆరిఫ్ అహ్మద్, బాబుజానీ, ఫసియుద్దీన్ ఖాలీద్, సురేష్, సుధాకర్, రాజు, ఆసిమ్, అంజద్ ఖాన్, మజారొద్దీన్, అక్బర్, మొహసీన్ మొహియుద్దీన్, వాజిద్ ఖాన్, అనెమల్ల సురేష్, కొమ్ముల రామేశ్వరి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు రాఫియా సుల్తానా, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఫలితాలకు ముందే ఓటమిని ఒప్పేసుకున్న సీఎం

### సీఎం రేవంత్, ఒవైసీల స్క్రిప్ట్ ఒక్కటే..

### కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ముందా?

### కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్

**ప్రజానావ, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కంటే ముందే కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించిందని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనంతో బీజేపీపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, సీఎం వ్యాఖ్యలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమని ఇంటెలిజెన్స్ నివేదికలు అందడంతోనే ముఖ్యమంత్రి గందరగోళానికి గురవుతున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. “గత రెండేళ్లలో మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసినందుకు జనం బుద్ధి చెప్పాలని డిసైడ్ అయ్యారు. ఆ ఫ్రస్టేషన్‌లోనే సీఎం మాట్లాడుతున్నారు“ అని ఎద్దేవా చేశారు. ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య అపవిత్ర పొత్తు కుదిరిందని బండి సంజయ్ ఆరోపించారు. “ఒవైసీ, రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష, స్క్రిప్ట్ ఒక్కటే. బహుశా ఇది దారుస్సలాంలో లేదా గాంధీభవన్‌లో తయారవుతున్నట్లుంది. కాంగ్రెస్ అభ్యర్థులకు కాకుండా ఎంఐఎం అభ్యర్థులకు డబ్బులు పంపిస్తున్న మాట వాస్తవం కాదా? రూ.100 కోట్ల డీల్ కుదిరిందా లేదా అన్నదానిపై సీఎం సమాధానం చెప్పాలి“ అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అనే నాగుపామును ప్రజలే ఖతం చేశారని, జెర్రిపోతు లాంటి కాంగ్రెస్ పని కూడా ముగిసిందని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్, బీఆర్ఎస్ నేతల అవినీతిపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. “ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోతుంటే రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? తన చేతగానితనాన్ని ఇతరులపై నెట్టడం సీఎక్కు అలవాటైపోయింది. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము, పౌరుషం నాకు లేవు అని కేంద్రానికి ఒక లేఖ రాయండి.. అప్పుడు మేం ఏం చేస్తామో మీకే తెలుస్తుంది“ అని బండి సంజయ్ సవాల్ విసిరారు. బీజేపీకి దేశం, ధర్మమే ముఖ్యమని.. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కరీంనగర్ సహా అన్ని పట్టణాలను కేంద్ర నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు, హత్యలు

### మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నుపోటు

### సీఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆరోపణలు



**ప్రజానావ, మహబూబ్‌నగర్:** రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు.మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ఎ÷-లాన్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

## 11న మున్సిపల్ పరిధిలో సెలవు

**ప్రజానావ, హైదరాబాద్:** ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.



సంపాదకీయం

# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి!

తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయినీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.



# స్పీకర్ తీరుపై విపక్షాల ఆగ్రహం

- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ




**న్యూఢిల్లీ:** పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మరోవైపు, ప్రధానమంత్రి మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

## బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' పక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తావే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ పక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్టాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ పక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. దీంతో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ఎన్నికల తుది జాబితా గడువును మరో వారం రోజుల పాటు ఫిబ్రవరి 21 వరకూ పొడిగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.




# డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీం వ్యాఖ్యలు

- సైబర్ నేరగాళ్లు రూ.54వేల కోట్లు కొల్లగొట్టారని ఆందోళన
- ఆర్‌బిఐ, బ్యాంకులు, టెలి కమ్యూనికేషన్‌లు ఉమ్మడి కార్యాచరణ చేయాలి

**న్యూఢిల్లీ:** దేశంలో డిజిటల్ అరెస్ట మోసాలు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్ల రూ. 54వేల కోట్లు కొల్లగొట్టారని, ఇది భారీ దోపిడీ అంటూ ఆందోళన వ్యక్తంచేసింది. దోచుకున్న సొమ్ము చిన్నరాష్టాల బ్జడెట్ కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ మోసాలపై అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా విచారణ జరిగింది. వాటికి చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ విభాగం సంప్రదింపులతో నిర్ణీత ప్రమాణాల కార్యాచరణను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అందుకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఈ నేరాలకు కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, కుట్ర కూడా కారణం కావొచ్చని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆర్‌బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు ఉండాలని ఆదేశించింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో పరిహారం విషయమై ఆర్‌బీఐ, టెలికమ్యూనికేషన్ విభాగం, ఇతర విభాగాలు సంయుక్తంగా సమావేశంకావాలని సూచించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ఉపశమనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక మోసపూరిత లావాదేవీకి రూ. 25,000 వరకు పరిహారాన్ని అందివ్వనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ఆ లావాదేవీలు దురుద్దేశంతో కూడుకున్నవి కాకుండా ఉండాలన్నారు.




# ఐటీ కంపెనీల్లో ఏఐ నిపుణుల నియామకాలు

## వీసా ఖర్చులకు వెనకాడని ప్రముఖ సంస్థలు

**న్యూఢిల్లీ:** భవిష్యత్తు ఏఐదే అని అమెరికా టెక్ కంపెనీలు బలంగా నమ్ముతున్నాయి. భారీగా పెట్టుబడులు కుమ్మరిస్తున్నాయి. అంతేకాకుండా, ఈ రంగానికి చెందిన విదేశీ నిపుణులను హెచ్-1బీ వీసాల ద్వారా పెద్ద ఎత్తున నియమించుకుంటున్నాయి. వీసా ఫీజులు పెరిగినప్పటికీ అమెరికా టెక్ సంస్థలు అక్కడి కార్మిక శాఖకు వీసా పిటిషన్లు దరఖాస్తు చేసుకుంటున్నాయి. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) సంస్థ జరిపిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్ యాపిల్ 2025 ఆర్థిక సంవత్సరంలో విదేశీయుల నియామకాల కోసం సమర్పించిన లేబర్ కండీషన్ అప్లికేషన్లలో(ఎల్‌సీఏ) మెజారిటీ ఏఐ సంబంధిత ఉద్యోగాలవే. ఫారినర్ల తరఫున హెచ్-1బీ పిటిషన్‌ల దాఖలకు మునుపు కంపెనీలు ఎల్‌సీఏను దాఖలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అమెజాన్ సమర్పించిన 60 శాతం ఎల్‌సీఏ దరఖాస్తులు ఏఐ సంబంధిత ఉద్యోగాల కోసమేనని ఎన్ఎఫ్ఏపీ అధ్యయనంలో తేలింది. మెటా ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 58 శాతం, గూగుల్ ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 71 శాతం ఏఐ సంబంధిత ఉద్యోగాలవేనని తెలిసింది. ఏఐ రంగంలో నిలదొక్కుకునేందుకూ అమెరికా సంస్థలు విదేశీ నిపుణులపై ఆధారపడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం, అమెరికన్ టెక్ కంపెనీలు ఇప్పటికే ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇదే క్రమంలో ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగుల వీసా ఖర్చుల విషయంలో కూడా వెనకాడట్లేదు. ఖర్చులు తగ్గించుకునేందుకే కంపెనీలు హెచ్-1బీ వీసాదారులకు ఉద్యోగాలు ఇస్తాయన్న విమర్శ ఇకపై చెల్లుబాటు కాదని కూడా విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. 1990-2010 మధ్య కాలంలో అమెరికా ఉత్పాదకతలో 30 శాతం -50 శాతం స్టెమ్ రంగాలకు చెందిన విదేశీ నిపుణులు కారణమని కొందరు ఆర్థికవేత్తలు అంచనావేశారు. ఏఐ రంగంలో అమెరికా అగ్రగామిగా ఉండాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అయితే, వలసలపై ఆయన అమలు చేస్తున్న కఠిన ఆంక్షల కారణంగా అమెరికా వెనకబడే అవకాశం ఉందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి.





# దేవాదాయ శాఖ కమిషనర్‌కు మహా శివరాత్రి జాతర ఆహ్వానం

**ప్రజానావ, వేములవాడ:** సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాద్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హరీష్‌కు ఆలయ ఈవో ఎల్ రమాదేవి మర్యాదపూర్వకంగా కలిసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు కమిషనర్‌కు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను సమర్పించారు. జాతర నిర్వహణ తీరు, భక్తులకు కల్పిస్తున్న వసతులపై కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత

**మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్**



**ప్రజానావ, సికింద్రాబాద్ :** పేద రోగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని తాము సద్వినియోగం చేసుకుంటామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన మేడిబావి ప్రాంతంలోని రాజేశ్వరి తీవ్ర అస్వస్థతకు గురై, సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని సహాయానికై ఆశ్రయించారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్ ఆమెకు రూ.రెండు లక్షల విలువజేసె ఎల్.ఓ.సి. పత్రాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సమకూర్చి సోమవారం తన కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితాఫలమండిలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన



**ప్రజానావ, సిరిసిల్ల/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. సిరిసిల్ల పట్టణం గీతానగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సోమవారం ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో ముందు రోజు (ఈ నెల 10 వ తేదీన మంగళ వారం) అలాగే పోలింగ్ రోజున (ఈ నెల 11 వ తేదీన బుధవారం) సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని విద్యా సంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోలింగ్ రోజున ఈ నెల 11వ తేదీన సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# అవినీతి పార్టీలను నిలదీయండి

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే!
- 'సింహం' గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వండి
- ఉమ్మడి కరీంనగర్‌లో 26 సీట్లు గెలుస్తాం
- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి



**ప్రజానావ, కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు సింహం గుర్తుపై ఓటు వేసి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ మెజారిటీగా 26 సీట్లు గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యాలయంలో ఏఐఎఫ్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపాడుగు హరిప్రసాద్‌లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంబటి జోజిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, సంక్షేమ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయి కారి ఒప్పందం ఉందని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నేత బండి సంజయ్ కార్పొరేషన్‌కు ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలు నిలదీయాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ పేరుతో భారీ అవినీతి జరిగిందని, ఆ దోపిడీని ప్రజలు ప్రత్యక్షంగా చూశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని, కనీసం 26 సీట్లు తమ ఖాతాలో పడతాయని స్పష్టం చేశారు. అనంతరం ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10 మున్సిపాలిటీలు, రెండు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మొత్తం 132 చోట్ల ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు సరైన ఆలోచనతో సింహం గుర్తుపై ఓటు వేసి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే ప్రజలు ప్రశ్నించాలని, అవినీతి పార్టీలను ఈ ఎన్నికల్లో నిలదీసి నిజమైన ప్రత్యామ్నాయంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ నగర అధ్యక్షుడు సత్యారావు, నాయకులు ముత్యాల విజయ్‌కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు వరాల శ్రీనివాస్, సుధా వైష్ణవి, రాజు కుమార్, శీలం శ్రీనివాస్, జాగృతి నాయకులు జూతది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయమే లక్ష్యం



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారికి చట్టపరంగా సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో 'గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం బాధితుల నుంచి స్వయంగా 21 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల తీవ్రతను బట్టి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం కలిగించేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపిగ్గా వినాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, అవి ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు. పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని, గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా ఉన్నతాధికారులను కలిసి తమ ఆవేదనను చెప్పుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది మరియు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

# ఆర్థిక అవగాహన పెంచాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజానావ, సిరిసిల్ల:** ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారం సందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సభ్యుల సమక్షంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జనాభాలోని వివిధ వర్గాలలో ఆర్థిక అవగాహనను పెంచే లక్ష్యంతో ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారాన్ని అమలు చేస్తుందని వివరించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కేవైసీ – సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు అనే థీమ్‌తో పాటించాలని ప్రతిపాదించారని తెలిపారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ), సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీ (సీకేవైసీ,కేవైసీ సంబంధిత మోసాలు మనీ మ్యూలింగ్‌కు వ్యతిరేకంగా జాగ్రత్తలతో సహా, ఖాతా క్రమశిక్షణను పాటించడం, ప్రజలలో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సమన్వయంతో జిల్లాస్థాయిలో అనేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆర్బీఐ, బ్యాంకులు ఎప్పుడూ మెయిల్‌లు, ఎస్ఎంఎస్ లు పంపదు లేదా బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని అడిగే కాల్‌లు చేయదని స్పష్టం చేశారు. వివిధ సోషల్ మీడియాల ద్వారా మొబైల్ ఫోన్లకు వచ్చే ఆఫర్లు, లింకులు, ఫోన్లకు స్పందించ వద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు ఉన్నారు.

# పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలి

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ప్రజానావ, సిరిసిల్ల:** మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ ను పలు జోన్లుగా పారిశుధ్య పనుల నిర్వహణకు వేములవాడ మున్సిపల్, రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించి.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణాన్ని 20 జోన్లుగా విభజించి ప్రతి జోనుకు ఒక పంచాయతీ కార్యదర్శిని ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించి.. వారికి సిబ్బంది, శానిటేషన్ పరికరాలు ఇస్తామని తెలిపారు. వీరు అందరూ ఈ నెల 13 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు వేములవాడలో సేవలు అందించాలని సూచించారు. పార్కింగ్, ఇతర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. జాతర ప్రదేశాల్లో స్వచ్ఛంగా.. పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పారిశుధ్య పనులు చాలా కీలకమని, అందరూ సమన్వయం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, డీపీఓ షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



## సమయపాలన పాటించాలి

**ప్రజానావ, జైనూర్:** అంగన్వాడి కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా అన్నారు. జైనూర్ ప్రాజెక్ట్ లోని అంగన్వాడి కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తలతో సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్వాడి కేంద్రాల్లో తప్పనిసరి ఉండాలన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి కోసం అందరు సహకరించాలని, సమయపాలన పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కేంద్రాల్లో మూమెంట్ రిజిస్టర్ ను ఉంచాలని అన్నారు. కేంద్రాలకు ప్రతినెల గ్రామపంచాయతీ కార్యదర్శులు, తహశీల్దార్, సంబంధిత అధికారులు వచ్చినప్పుడు కార్యకర్తలు వారికి సహకరించాలన్నారు. ఆన్లైన్ వర్క్ తో పాటు రిజిస్టర్ ను అంగన్వాడి కేంద్రంలో మెయింటెన్ చేయాలని తెలిపారు. సున్నా నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు, గర్భిణీ, బాలింతల రికార్డులను వెంటనే పొందుపర్చాలని ఆదేశించారు. ఫ్యామిలీ సర్వేలు పూర్తిస్థాయిలో చేయాలని, ఎన్ఎస్టిహెచ్ వెబ్సైట్లో గర్భిణీ, బాలింతలు, పిల్లల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వంట సామాగ్రి శుభ్రంగా ఉంచాలని, గ్యాస్ పొయ్యి దగ్గర చిన్న పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమ్మ, సోంబాయి, హజీరా, సృజన, శ్యామ్ మామ్ కోఆర్డినేటర్ నరేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



**ప్రజానావ, జైనూర్:** ఓ గర్భవతి అంబులెన్సులోనే బిడ్డకు జన్మనిచ్చింది. సిర్పూర్(యూ) శెట్టిహడాపనూర్ గ్రామపంచాయతీలోని శెట్టిహడాపనూర్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ వెడ్మ నిర్మలకు పురిటి నొప్పులు రావడంతో ఆశ వర్కర్ వెడ్మ రానుబాయి 108 అంబులెన్సు కు సమాచారం అందించారు. సిబ్బంది తక్షణమే స్పందించి ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో నొప్పులు అధికం కావడంతో అత్యవసర సమయంలో మార్గమధ్యలో 108 అంబులెన్సు లోనే ప్రసవించింది. పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చినట్టు 108 ఈఎంటీ ప్రశాంత్ కుమార్, పైలెట్ రవి నలగంటి తిలిపారు. అనంతరం సిర్పూర్(యూ) ఆసుపత్రికి తరలించినట్టు ఆశ వర్కార్ పేర్కొన్నారు. 108 సేవలు ఎప్పటికి మరువలేమని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వివరించారు.

## ప్రచార కార్య క్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్

**ప్రజానావ, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ అజ్మత్ ఉల్లాతో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీల, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలంటూ వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నిరుపేదలకు నీడ కల్పించే విధంగా ఇందిరమ్మ ఇళ్లు కల్పిస్తామని తెలిపారు. కాలనీలలో ప్రధాన సమస్యలుగా రోడ్లు, డ్రైనేజీ విస్తరణ చేపడతామన్నారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, సామాజిక సేవకులు ఆడే జైపాల్, మండల మహిళా అధ్యక్షురాలు అనసూయ, సమీర్, పిరాజి, రమ, కార్య కర్తలు పాల్గొన్నారు.




# అధికార దుర్వినియోగంతో అక్రమ కేసులు



**ప్రజానావ, కాగజ్‌నగర్:** అధికార దుర్వినియోగంతో అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. సోమవారం కాగ జ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈనెల 7న ఉదయం కన్యకాపరమేశ్వరి ఆలయం వ ద్ద చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న అజారుద్దీన్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తున్న ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కేశెట్టి శంకరయ్యను బండతో కొట్టాడని తెలిపారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న బీజేపీ నాయకులు శివ గౌడ్, చిలువేరు ప్రవీణ్ ఎందుకు కొట్టావని ప్రశ్నించగా 'మజాక్‌లో కొట్టాను' అంటూ హేళనగా మాట్లాడాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని దరఖాస్తు ఇస్తే, హిందువులపై ఆరు సెక్షన్లతో నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి, అదే అజారుద్దీన్‌పై కేవలం ఒక సెక్షన్ మాత్రమే పెట్టారని విమర్శించారు. ఇది స్పష్టమైన అధికార దుర్వినియోగమని ఆరోపించారు. మైనార్టీల ఓట్ల కోసమే కాంగ్రెస్ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారని, ఎమ్మెల్సీ దండే విఠల్‌కు దమ్ముంటే బీజేపీ కన్నా ఒక్క సీటైనా ఎక్కువగా సాధించాలని సవాల్ విసిరారు. అక్రమ కేసులతో కోనప్ప బాటలో నడవద్దని హితవు పలికారు. సాక్షాత్తు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ మైనార్టీల సంతృప్తికరణకు పాల్పడుతూ కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు తాము ఎన్నడూ భయపడలేదని, ఇలాంటి చర్యలతో తమ మనోబలం మరింత పెరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ బల్దియాపై కాషాయ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ కొండ్ర మనోహర్ గౌడ్, సర్పంచ్ నానయ్య, ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, బీజేపీ సీనియర్ నాయకులు గుల్బం చక్రపాణి, ఘనపురం నాగేష్, శివ గౌడ్, తూడురు కృష్ణ, చిలువేరు ప్రవీణ్, సమీర్ గుప్తా, అరుణ్ లోయ, పెద్ది హరీష్, విజయ్, సౌరబ్ ధాత్రక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిద్దాం



**ప్రజానావ, ఆదిలాబాద్:** కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిద్దామని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 9,10,40,41,45 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్ధతుగా గడప గడప కు ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న కాలంలో ఆదిలాబాద్ పట్టణంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియ కూడా అత్యంత కీలకమని, కౌంటింగ్ సిబ్బందికి ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజు అభ్యర్థుల సమక్షంలో ప్రతి దశను వీడియోగ్రఫీ చేస్తూ నిస్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చిన పక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డ్రా ద్వారా విజేతను ప్రకటిస్తామని అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల కౌంటింగ్ కోసం 49 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఒక్కో వార్డులో సుమారు 3వేలకు పైగా ఓట్లు ఉండే అవకాశం ఉందని, మూడు నుంచి నాలుగు రౌండ్లలో లెక్కింపు కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఈనెల 12న జరిగే రెండో విడత శిక్షణకు, అలాగే 13న జరిగే కౌంటింగ్ రోజున నిర్ణీత సమయానికి హాజరు కావాలని, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, నోడల్ అధికారులు మనోహర్, ఫణిందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, శిక్షకులు, సంబంధిత ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యాప్ ద్వారా యూరియా బుకింగ్

**ప్రజానావ, తాండూర్:** యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని ఏడీఏ రాజ నరేంద్ర అన్నారు. వ్యవసాయ కమిషనర్ సూచనల మేరకు యూరియా బుకింగ్ యాప్ గురించి సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పట్టా పాస్ బుక్ కు లింక్ ఉన్న నంబర్‌తో యాప్‌లో మొబైల్ నెంబర్ పొందుపర్చి ఓటీపీ ద్వారా లాగిన్ అయి యూరియా బుక్ చేసుకోవాలని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యూరియా, ఎరువుల దుకాణాల్లో పొందవచ్చని సూచించారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. యూరియా బుకింగ్ యాప్ లో సందేహాలను నివృత్తి కోసం మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారి అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కే సుష్మ, ఏఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి

**ప్రజానావ, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్లే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు కోరారు. సోమవారం 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూర్పటి సుజాత భూమ్మన్న తరుపున ప్రచారం నిర్వహించారు. వార్డులో అన్ని మౌలిక సదుపాయాలు కావాలన్నా, పట్టణం అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుష్టు రహిత సమాజం కోసం నడుం బిగిద్దాం

**పెద్దాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ**



**ప్రజానావ, జూలపల్లి:** జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామ పంచాయితీలో గ్రామ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ సర్పంచ్ తొగరు శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామస్తులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్మూలన కోసం అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ.. శరీరంపై పాలిపోయిన లేక రాగి రంగు మచ్చలు ఉండి అక్కడ స్పర్శ లేనప్పుడు, నొప్పి తెలియని స్థితిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాదాలు, చేతులు, వేళ్లు తిమ్మిరిగా ఉన్నా, చర్మం దళసరిగా మారి ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతున్నా వ్యాధిగా అనుమానించాలని తెలిపారు. అరచేతులు, అరికాళ్లలో కండరాల బలహీనత, అంగవైకల్యం లేక కంటి పైరెప్పల బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కుష్టు వ్యాధి ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుందని, శరీరంపై ఒకటి నుండి ఐదు వరకు మచ్చలు ఉండి ఏదైనా ఒక నరానికి వ్యాధి సోకడాన్ని పాసీ బేసిలరీ లెప్రసీ (పీబీ) అంటారని వివరించారు. అలాగే శరీరంపై మచ్చల సంఖ్య ఆరు లేక అంతకంటే ఎక్కువగా ఉండటం, ఒకటి కంటే ఎక్కువ నరాలకు వ్యాధి సోకడాన్ని మల్టీ బేసిలరీ లెప్రసీ (ఎంబీ) అని పేర్కొన్నారు. ఈ వ్యాధిని రెండు లేక మూడు ఔషధాల కలయికతో కూడిన బహు ఔషధ చికిత్స (ఎండీటీ) ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ మందులు 28 రోజులకు ఒక బ్లిస్టర్ ప్యాక్ రూపంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ప్రారంభ దశలోనే చికిత్స తీసుకోవడం ద్వారా అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని, ఇది అంటువ్యాధి కాదని ప్రజలకు వివరించారు. ఒంటి మీద స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలని, ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెల్ల కనుకయ్య, వార్డు సభ్యులు తీగల అశోక్, కళ్లెపెల్లి మహేందర్, కార్యదర్శి సతీష్, ఏఎన్ఎంలు రుక్మిణి, అరుణ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 11న వేతనంతో కూడిన సెలవు

**ప్రజానావ, పెద్దపల్లి:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వాణిజ్య, దుకాణ, వ్యాపార సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఫిబ్రవరి 11న వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది అందరికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11 బుధవారం నాడు జరిగే ఎన్నికల సందర్భంగా కార్మికులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా యజమానులు సహకరించాలని కోరారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, షిఫ్ట్ పద్ధతిలో పనిచేసే ఉద్యోగులకు కూడా సెలవు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 ప్రకారం యజమానులు తమ సంస్థలను మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని దుకాణ, వాణిజ్య సంస్థల యజమానులు ఈ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి సెలవు ప్రకటించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు. ఓటరు చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## స్వతంత్ర అభ్యర్థికి టీఆర్పీ మద్దతు



**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు స్వతంత్ర అభ్యర్థి పోగుల రాజయ్యకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా వార్డులో గడప గడపకు తిరుగుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. టీఆర్పీ జిల్లా అధ్యక్షులు కాసీపేట ఉదయ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం మాటలతోనే కాలం గడుపుతున్న పాలకులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుకు నిరసనగా కత్తెర గుర్తుకు ఓటు వేసి స్వతంత్ర అభ్యర్థి పోగుల రాజయ్యను కౌన్సిలర్‌గా గెలిపించాలని ఉదయ్ పిలుపునిచ్చారు. అప్పుడే స్థానిక సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 20లోగా రైతులు పత్తి విక్రయించాలి

**జిల్లా మార్కెటింగ్ అధికారి మొహ్మద్ షాహబుద్దీన్**

**ప్రజానావ, మంచిర్యాల:** జిల్లాలోని రైతులు ఈనెల 20వ తేదీలోగా తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి మొహ్మద్ షాహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025-26 పత్తి సీజన్ కు సంబంధించి కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈక్రమంలో రైతులు తమ సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 20వ తేదీ లోపు విక్రయించాలని తెలిపారు. ఈ మేరకు ముందస్తు సమాచారం అందించడం జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించి లబ్ధి పొందాలని కోరారు.

# తీర్థ యాత్రికులకు ప్రత్యేక రైళ్లు

- **ఐఆర్సీటీసీ టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్**



**ప్రజానావ, మంచిర్యాల:** తీర్థ యాత్రలకు వెళ్లేవారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్సీటీసీ- టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్ తెలిపారు. సోమవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి, రైల్వే శాఖ అధికారులతో కలిసి రైల్ టూర్ ప్యాకేజెస్ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21, ఏప్రిల్ 14 తేదీల్లో రెండు ప్రత్యేక ప్యాకేజీలను "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ద్వారా హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్యాకేజీలో మార్చి 21వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు దివ్య దక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14,700, 3 ఏసీ ధర రూ.22,300, 2 ఏసీ ధర రూ.28,700 ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొనసాగుతుందని వివరించారు. 2వ ప్యాకేజీలో ఏప్రిల్ 14న ప్రారంభమై 24వ తేదీ వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ఉజ్జయిని (మహాకాళేశ్వర్ ఓ ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గృష్ణేశ్వర్) ఉంటుందని, ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.17,600, 3 ఏసీ ధర రూ.26,700, 2 ఏసీ ధర రూ.34,600లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్ఖేడ్, హజూర్ సాహిబ్ నాందేడ్, పూర్ణ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు- సమన్వయకర్తలు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకురుస్తారని అన్నారు. కోచ్ కు ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని పేర్కొన్నారు. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు సెల్: 9701360701, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని, ఇతర వివరాలకు www.irctc-tourism.com వెబ్ సైట్‌లో సంప్రదించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన



**ప్రజానావ, తాండూర్:** మాదారం త్రీ ఇంక్లైన్‌లోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. మాదారం త్రీ ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్లు తిరుమలేశ్వరి, సువర్ణ, లక్ష్మి, ఆయా, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే తాండూర్ సెక్టార్ లోని అచలాపూర్--5 అంగన్వాడి కేంద్రంలోనూ పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో అచలాపూర్ సర్పంచ్ మార్శెట్టి స్రవంతి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, అంగన్వాడీ టీచర్లు జాడి గోపమ్మ, మల్లు బాయి, జ్యోతి, కౌసల్య, అర్చన, సునీత, అమృత తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ అభివృద్ధి అంటే కేసీఆర్

- **వందల కోట్ల నిధులతో పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత ఆయనదే**
- **20 వార్డుల్లోనూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి: వంటేరు ప్రతాప్ రెడ్డి**




**ప్రజానావ, గజ్వేల్:**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం 14వ వార్డు అభ్యర్థి గుంటుకు శిరీష రాజు, 6వ వార్డు అభ్యర్థి బొగ్గుల స్వప్న సురేష్ కు మద్దతుగా ఆయన ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి హామీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడమే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు రావాల్సిన నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు.

**ప్రగతి పథంలో గజ్వేల్**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి 50 ఏళ్లు ముందుకు తీసుకెళ్లారని వంటేరు కొనియాడారు. మిషన్ భగీరథ ద్వారా 150 కోట్ల రూపాయలతో ప్రతి ఇంటికీ గోదావరి జలాలు అందించారని గుర్తు చేశారు. పట్టణంలో 150 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, 49 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. పేద విద్యార్థుల కోసం 150 కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ హబ్, 30 కోట్ల రూపాయలతో జిల్లా ఆస్పత్రి, ఐఓసీ భవన నిర్మాణం జరిగిందని వివరించారు. చిరు వ్యాపారుల కోసం 30 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్, రైతుల పంటల నిల్వ కోసం 30 కోట్ల రూపాయలతో గోదాములు నిర్మించినట్లు చెప్పారు. నిరుపేదల కోసం 100 కోట్ల రూపాయలతో 1250 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, రైలు సౌకర్యం కోసం 400 కోట్ల రూపాయలతో రైల్వే లైన్ల నిర్మాణం కేసీఆర్ కృషితోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

**కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలి**

గజ్వేల్ నుండి ప్రజ్ఞాపూర్ వరకు నాలుగు లైన్ల రహదారి, మల్లన్న సాగర్ ద్వారా శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారం జరిగిందని వంటేరు తెలిపారు. కోర్టు భవనం, జర్నలిస్టు కాలనీ, మాతా శిశు సంరక్షణ కేంద్రం, బస్తీ దవాఖానాలు, అర్బన్ పార్క్, కుల భవనాలు, బస్టాండ్లు వంటి అనేక సౌకర్యాలను బిఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని వివరించారు. గజ్వేల్ ను దేశ పటంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని, ప్రత్యర్థి పార్టీల మాటలను నమ్మకుండా 20 వార్డుల్లోనూ బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**



**ప్రజానావ, సిరిసిల్ల:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో పోలింగ్ అధికారులు, సిబ్బంది మూడో విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు. కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, నోడల్ అధికారి భారతి, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- ఎన్నికల పరిశీలకులు మంద మకరంద్ ఆదేశం
- మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



**ప్రజానావ, తూప్రాన్:**
రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు మంద మకరంద్ సోమవారం తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించారు. ఆర్డీవో జయచంద్రా రెడ్డి, డీఎస్పీ నరెందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డిలతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ వద్ద ఉన్న నోబుల్ ఫార్మసీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సామగ్రి భద్రత, పంపిణీ ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా సాగాలని స్పష్టం చేశారు.

### నిబంధనల అమలులో అప్రమత్తత అవసరం

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు.. ఓటర్లకు కల్పిస్తున్న తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, క్యూలైన్ల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీల పోస్టర్లు, జెండాలు, ఫ్లెక్సీలు ఉండకూడదని, ప్రచారంపై పూర్తి నిషేధం ఉంటుందని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి మైకులు వాడినా, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం అదే పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన మకరంద్.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంగకృష్ణ, తహశీల్దారు చంద్రశేఖర్, ఎస్సైలు గంగా రాజు, యాదగిరి, ఎన్నికల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచేది ఎర్రజెండానే

- సీపీఎం అభ్యర్థి బండ్ల స్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన నిరంతర పోరాటం: చుక్క రాములు



**ప్రజానావ, గజ్వేల్:**
గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా ఏటిగడ్డ కిష్టాపూర్‌లో సీపీఎం బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా కొట్లాడేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు కేవలం డబ్బు, భూములు, వ్యాపారాల కోసమే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే సత్తా సీపీఎంకే ఉందని తెలిపారు.

### నిర్వాసితుల గోస పట్టని పాలకులు

మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం సీపీఎం మొదటి నుంచీ అలుపెరగని పోరాటం చేస్తోందని చుక్క రాములు గుర్తు చేశారు. 2013 భూసేకరణ చట్టం అమలు కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లిన చరిత్ర తమ పార్టీదని చెప్పారు. ముంపు గ్రామాల ప్రజలు ఆర్అండ్ఆర్ కాలనీలకు వచ్చి ఐదేళ్లు గడిచినా.. ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్లు దాటిన యువతకు, ఒంటరి మహిళలకు ప్యాకేజీలు అందలేదని దుయ్యబట్టారు. కాలనీల్లో స్మశానవాటికలు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మండిపడ్డారు.

### ప్రశ్నించే గొంతుకగా బండ్ల స్వామి

12వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండ్ల స్వామి ఒక సామాన్య కార్మికుడని, మచ్చలేని నాయకుడని చుక్క రాములు అభివర్ణించారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాలు తెలిసిన స్వామిని సుత్తి, కొడవలి, చుక్క గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బండ్ల స్వామి గెలిస్తేనే మున్సిపాలిటీలో నిర్వాసితుల గొంతుక వినిపిస్తుందని తెలిపారు. అనంతరం అభ్యర్థి బండ్ల స్వామి మాట్లాడుతూ.. తాను కౌన్సిలర్‌గా గెలిస్తే ముంపు గ్రామాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎల్లయ్య, వేణుగోపాల్, రంగారెడ్డి, కటకం మహేష్ తో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టిన రాజ్యాధికార పార్టీ

- బీసీల రాజ్యాధికారమే లక్ష్యం: జిల్లా అధ్యక్షులు ఉదయ్, గుండెబోయిన స్వామి
- పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచిన 'కత్తెర' గుర్తు



**ప్రజానావ, పెద్దపల్లి:**
పెద్దపల్లి మున్సిపల్ ఉప ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన సోమవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ తమ బలాన్ని ప్రదర్శించింది. వార్డు నంబర్లు 2, 21, 22, 27లలో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముగింపు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు ఉదయ్, గుండెబోయిన స్వామి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బూటకపు మాటలతో ప్రజలను నమ్మిస్తోందని మండిపడ్డారు. బీసీల హక్కులు, రాజకీయ భాగస్వామ్యం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు దక్కాల్సిన వాటాను సాధించుకోవడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో బీసీల గళం బలంగా వినిపించాలంటే 'కత్తెర' గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తమ పార్టీ అభ్యర్థులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ ముగింపు ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూంలు పూర్తి చేయాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూంలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడ, కొండాపూర్, మద్దికుంట, బద్దెనపల్లి, తంగళ్ళపల్లిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా వాటిపై సమీక్షించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. ఆయా ఇండ్ల పనులను గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టి ..త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సాజిద్, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో 'సింహం' గర్జన

### 13వ వార్డులో సల్వాజి తిరుమల్ జోరు

### యువత, అసమ్మతి వర్గాల మద్దతుతో దూసుకెళ్తున్న ఫార్వర్డ్ బ్లాక్

### 32వ వార్డులోనూ మర్రిపల్లి జలజ సతీష్ ముమ్మర ప్రచారం



**ప్రజానావ, పెద్దపల్లి:**
పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధానంగా 13వ వార్డులో ఆ పార్టీ అభ్యర్థి సల్వాజి తిరుమల్ 'సింహం' గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పూర్తిగా విజయం సాధించారు. ప్రస్తుతం అక్కడి రాజకీయ పరిస్థితులను బట్టి ఆయన గెలుపుకు కూతవేటు దూరంలో ఉన్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లోని అసమ్మతి వర్గాలు, ఇతర పార్టీల నాయకులతో పాటు వార్డులోని యువతరం తిరుమల్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. దీంతో ఆయన విజయం నల్లేరు మీద నడకేనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు 32వ వార్డులో పోటీ చేస్తున్న మర్రిపల్లి జలజ సతీష్ కూడా ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. రాజకీయాలను రసకందాయంలో పడేస్తూ, ప్రచారంలో నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. వీరి ప్రచార తీరుకు వార్డు ప్రజలు మంత్రముగ్ధులవుతున్నారు. ప్రజల్లో సింహభాగం మద్దతు సింహం గుర్తుకే లభిస్తుండటంతో ప్రధాన ప్రతిపక్షం జాడ ఎక్కడని ఆరా తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తానికి ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ పోరులో సింహం గుర్తు అభ్యర్థులు అధిక స్థానాల్లో గెలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

# బ్యాంకు ఖాతాదారులు కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి

### ఆర్బీఐ సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

### తిరుమలపూర్, రంగదాముని పల్లె గ్రామాల్లో సదస్సు



**ప్రజానావ, గొల్లపెల్లి:**
జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని తిరుమలపూర్, రంగదాముని పల్లె గ్రామాలలో కేవైసీ (నో యువర్ కస్టమర్) పై అవగాహన కార్యక్రమాన్ని సీఎఫ్ఎల్ ప్రతినిధులు నిర్వహించారు. ఆర్బీఐ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సీఎఫ్ఎల్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. దీనివల్ల బ్యాంకింగ్ లావాదేవీలు సులభతరం కావడంతో పాటు ఖాతా భద్రత పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజలి గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు విక్రమ్, స్రవంత్ రాథోడ్, వీఓఏ జయపాల, ఫీల్డ్ అసిస్టెంట్ నడిమెట్ల మహేష్ పాల్గొన్నారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రమేష్, వెంకటేష్, విజయ్ బ్యాంకింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# డబుల్ ఇంజన్ సర్కారుతోనే దేవరకద్ర అభివృద్ధి

### ఎంపీ డీకే అరుణమ్మ

### దేవరకద్రలో బీజేపీ ఎన్నికల ప్రచార హోరు.. భారీగా పాల్గొన్న నేతలు

### ఎమ్మెల్యే అసత్య ప్రచారాలను నమ్మొద్దు: కొండ ప్రశాంత్ రెడ్డి



**ప్రజానావ, దేవరకద్ర:**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార పర్వం చివరి రోజైన సోమవారం బీజేపీ శ్రేణులు భారీ రోడ్ షో నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ, పార్లమెంటు కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్ రవికుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్ పట్టణ పురవీధుల్లో విస్తృతంగా పర్యటించి అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీల ప్రగతికి వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని స్పష్టం చేశారు. కమలం గుర్తును గెలిపిస్తే కేంద్రం, మున్సిపాలిటీ డబుల్ ఇంజన్ వేగంతో దేవరకద్రను అభివృద్ధి పథంలో నడిపిస్తామని వివరించారు. రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను ఎంపీ డీకే అరుణమ్మ కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించారని తెలిపారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆ నిధులను తానే తెచ్చానని అబద్ధాలు చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. నిజాలను గమనించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సైతం కేంద్ర ప్రభుత్వమే నిధులు అందిస్తుందనే వాస్తవాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ రోడ్ షోలో కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ వీధులన్నీ బీజేపీ జెండాలతో కాషాయమయంగా మారాయి.

## ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ:** 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించా ల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారి క డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దీని ప్రకారం, అప్పుల ఊబిలో ఉన్న ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐ) మొత్తం రూ. 89,952 కోట్లు, భారతీ గ్రూప్ రూ. 51,091 కోట్లు, టాటా గ్రూప్‌పై రూ. 20,426 కోట్లు, ఎంటీఎన్ఎల్‌పై రూ. 14,462 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై రూ. 1,984 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో వొడాఫోన్ ఐడియాకు చెందిన 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏజీఆర్ బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేశారు. అంటే, చెల్లింపు ప్రక్రియ వాయిదాలో ఉంది. దీనికి సంబంధించి వీఐ బకాయిలను పునఃపరిశీలన కోసం జనవరి 30న టెలికాం విభాగం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ కమిటీలో భారత ప్రభుత్వానికి చెందిన రిటైర్‌మెంట్ కార్యదర్శి స్థాయి అధికారి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నామినేట్ చేసిన ఓ ప్రతినిధి ఉంటారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయమే తుది ఫలితం కానుంది. అందుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.




## వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు

**న్యూఢిల్లీ:** మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ. 8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే




**ముంబై:** మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి. కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు. హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇదే 11 శాతం వడ్డీ రేటుకు చూస్తే నెలకు ఈఎంఐ రూ. 16,369 గా ఉండగా.. మొత్తం వడ్డీ రూ. 89,297 చెల్లించాలి. 12 శాతానికి చూస్తే మూడేళ్లలో నెలకు ఈఎంఐ రూ. 16,607 పడుతుంది. మొత్తం వడ్డీ రూ. 97,858 పడుతుంది.

# రష్యా ముడిచమురు దిగుమతులకు బ్రేక్!



**ముంబై:** గత ఏడాది కాలంగా భారత ఇంధన మార్కెట్‌లో రష్యా గుత్తాధిపత్యం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. 2025 జూన్ నాటికి భారత్‌కు రష్యా నుంచి వచ్చే క్రూడాయిల్ ఇంపోర్ట్స్ రికార్డు స్థాయిలో రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఆ సమయంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 44 శాతంగా నమోదై అగ్రగామిగా నిలిచింది. తక్కువ ధరకు చమురు లభిస్తుండటంతో భారతీయ రిఫైనరీలు రష్యా వైపే మొగ్గు చూపాయి.అయితే, 2025 నవంబర్ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలు మరియు మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు భారత చమురు దిగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చే చమురు రవాణాపై ఉన్న పరిమితులు మరియు లాజిస్టిక్స్ సమస్యల కారణంగా భారతీయ కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దీనివల్ల గతంలో ఉన్న జోరు కాస్తా తగ్గడం ప్రారంభమైంది.తాజా గణాంకాల ప్రకారం, జనవరి 2026 నాటికి రష్యా చమురు వాటా సగానికి సగం పడిపోయి 22 శాతానికి పరిమితమైంది. ప్రస్తుతం రోజువారీ దిగుమతులు 11.6 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయంటే, మార్కెట్‌లో వచ్చిన మార్పు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ పతనం సంభవించడం ఇంధన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులు పెరిగేందుకు దారితీసింది. దిగుమతులు భారీగా తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారత ఇంధన అవసరాల సరఫరాలో రష్యా ఒక కీలక భాగస్వామిగానే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవ డానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. భవిష్యత్తులో ధరల వ్యత్యాసం మరియు అంతర్జాతీయ పరిణామాలను బట్టి ఈ దిగుమతుల శాతంలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## స్పోర్ట్స్

### రాహుల్ సెంచరీతో ముంబై ఇంటికి..

# రంజీ సెమీఫైనల్లో కర్నాటక!

**రాజ్‌కోట్:** భారత జట్టుకే కాదు దేశవాళీలోనూ తాను ఆపద్బాంధవుడిని అని చాటుకున్నాడు కేఎల్ రాహుల్. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఈ క్లాస్ బ్యాటర్ సెంచరీతో గర్జించాడు. ముంబై బౌలర్లను చితక్కొడుతూ శతకంతో కర్నాటకను సెమీ ఫైనల్ చేర్చాడు. 325 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన రాహుల్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో 42 సార్లు ఛాంపియన్ ముంబైని ఇంటికి పంపాడు. దాంతో.. 11 ఏళ్ల తర్వాత టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచింది కర్నాటక. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో కేఎల్ రాహుల్ తన తడాఖా చూపించాడు. ముంబై నిర్దేశించిన భారీ ఛేదనలో మూడంకెల స్కోర్‌తో కర్నాటకను సెమీస్ తీసుకెళ్లాడు. ఎంసీఏ బీకేసీ మైదానంలో నాలుగో రోజు మయాంక్ అగర్వాల్(3) విఫలమవ్వగా.. రాహుల్‌నే నమ్ముకుంది కర్నాటక. శార్దూల్ ఠాకూర్, తుషార్ పాండే ఓవర్లో చెత్త బంతులను శిక్షించి లక్ష్యాన్ని కరిగించాడు. రాహుల్(130)కు కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్(39) అండగా నిలవగా చక్కని కవర్ డ్రైవ్స్‌తో అలరించిన అతడు అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం స్మరన్ రవిచంద్రన్(83 నాటౌట్)తో కలిసి విలువైనరన్స్ జోడించిన ఈ సొగసరి బ్యాటర్ 147 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికిది 24వ సెంచరీ. రాహుల్ ఖతర్నాక్ శతకంతో నాలుగు వికెట్ల తేడాతో ముంబైని చిత్తు చేసింది కర్నాటక.

**ఆ ఇద్దరు నిలబడడంతో..**



తొలి ఇన్నింగ్స్‌లో కర్నాటకు 53 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న ముంబై.. రెండో ఇన్నింగ్స్‌లో ఛాంపియన్‌లా ఆడింది. వికెట్ కీపర్ ఆకాశ్ ఆనంద్(70) హాఫ్ సెంచరీతో మెరవగా.. ఆఖర్లో తనుష్ కొతియాన్(48 నాటౌట్), తుషార్ దేశ్‌పాండే(47)లు కర్నాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి పట్టుదలతో రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 375 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం.. జార్జ్ మున్సే సూపర్ ఇన్నింగ్స్



**కోల్‌కతా:** టీ20 ప్రపంచ కప్ 2026 (౨20 ఔశీతీశ్రీ్స జబజూ-2026) లో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులు చేసింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (52), హెన్రీ మానెంటి (37), స్మట్స్ (22) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, దేవిడ్సన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84) అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37) పరుగులు రాబట్టాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌మిలన్ (41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22) వరుసగా 4, 2, 4, 6, 6 బాదడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ తీశారు.

## ఇండియాతో ఆడాలంటే.. 3 కీలక షరతులు పెట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు



**ఇస్లామాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్(ఖుఎఅఖఅ జతీఅఎఎవ్ దీశ్ఖుతీస) చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసీసీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసీసీ పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఐసీసీని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్డ్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో ఆ దేశానికి మద్దతు ఇస్తూ ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించిన విషయం తెలిసిందే.ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.



# తగిన వరుడి కోసం చూస్తున్నా

## అమ్మ సురేఖావాణికి మళ్లీ పెళ్లి చేయాలనుకుంటున్నా

### ఇంటర్వ్యూలో సుప్రీత

టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. 'రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పిందని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది. ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, శివకంఠనేని కీలక పాత్రల్లో నటించారు. జీవీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో మిస్టరీ, క్షుద్రపూజలు, మూఢనమ్మకాల అంశాలతో కథ నడుస్తున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.




# రాకున్నా మేనేజ్ చేస్తున్నా

## వారణాసి హీరోయిన్ ప్రియాంక

రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా

కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్‌లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారంతో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్‌గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతున్నాను. సెట్‌లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్‌లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్‌లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్‌కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.



# మృణాల్ చుట్టూ పెళ్లి రూమర్లు

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది.



# 11న నెట్‌ఫ్లిక్స్‌లోఅనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.

Published and Editor Owned by **Adula Thirupathi,** and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. **Phone No: 99484 33277.**